సాక్షి రంగారెడ్డి

బుధవారం । 10 । జనవరి । 2024



గ్రామాలాభివృద్ధికి కృషి

రాజకీయాలను పక్కనపెట్టి అందరూ అభివృద్ధి బాట పట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. 8లో▸



పట్టు పురుగుల పెంపకంతో..

వ్యవసాయానికి అనుబంధంగా పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు పొందొచ్చని సైంటిస్టు వినోద్‌కుమార్ అన్నారు. 8లో▸



బస్సు సర్వీసులు పెంచాలి

గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని పలువురు సర్పంచులు మండల సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

నూతన నియామకం



శ్యామలకు నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

తుర్కయంజాల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా మహిళా కన్వీనర్‌గా పురపాలక సంఘం పరిధి రాగన్నగూడకు చెందిన దుగ్గాని శ్యామలను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు డా. చామ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమెకు మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ యజమాని ఫాంహౌస్‌పై ఐటీ దాడులు



ఐటీ అధికారులు సోదాలు నిర్వహించిన ఫాంహౌస్

మొయినాబాద్: గ్లాండ్ ఫార్మా కంపెనీ యజమాని ఫాంహౌస్‌పై ఐటీ దాడులు జరిగాయి. ఫార్మా కంపెనీ యజమాని కేకే రాజు, ఝాన్సీలక్ష్మి దంపతులకు సంబంధించిన ఫాంహౌస్‌లో మంగళవారం ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఫార్మా కంపెనీపై ఐటీ సోదాల్లో భాగంగా మండల పరిధిలోని ఎనికెపల్లిలో ఉన్న నీమ్ ట్రీ ఫాంహౌస్‌కు ఉదయం ఆరుగురు ఐటీ అధికారులు వచ్చారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫాంహౌస్‌లో సోదాలు నిర్వహించారు. సోదాలు జరుగుతున్నంత సేపు ఫాంహౌస్ వైపు ఎవరినీ రానివ్వలేదు. స్థానిక పోలీసులకు సైతం ఐటీ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిసింది.

ప్రజాపాలన కంప్యూటరీకరణ పరిశీలన



కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న అధికారులు

మీర్‌పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన (అభయహస్తం) దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. కార్పొరేషన్‌కు సంబంధించి టీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నమోదు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం కందుకూరు ఆర్‌డీఓ సూరజ్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి, ప్రజాపాలన జిల్లా ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌రెడ్డి దరఖాస్తుల కంప్యూటరీకరణను పరిశీలించారు. డేటాఎంట్రీ ఆపరేటర్లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు కమిషనర్ వాణి తెలిపారు. కార్పొరేషన్‌లోని డివిజన్లకు సంబంధించిన కంప్యూటరీకరణ వివరాలను సూపర్ వైజర్‌లు ఆర్‌డీఓ, ప్రత్యేక అధికారికి వివరించినట్లు చెప్పారు. వీరి వెంట మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్‌సింగ్, మీర్‌పేట మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్ఐ అంజన్‌రెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి




మహేశ్వరం: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. తుక్కుగూడలోని డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జోన్ పరిధిలో గంజాయి, మత్తు పదార్థాల విక్రయం.. వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు కృషి చేస్తామన్నారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, వినియోగంపై నిఘా ఉంచి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీస్ విధానం ద్వారా ప్రజలకు చేరువై సేవలు అందిస్తామన్నారు. నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భూకబ్జాలు, దందాలు, దొంగతనాలు, హత్యలు, మహిళలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రైవేటు బడి.. అంతేనండి!

ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న పాఠశాలలు

- గుర్తింపు లేకుండా గుట్టుగా తరగతులు
- అనుమతుల పేరుతో అక్రమార్కుల వసూళ్లు
- ఎవరైనా ఫిర్యాదు చేస్తే నోటీసులతో సరి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పుట్టగొడుగుల్లా వెలుస్తున్న పలు ప్రైవేటు పాఠశాలలు, డేకేర్ సెంటర్లు జిల్లా విద్యాశాఖ అధికారుల పాలిట కామధేనువుల్లా మారుతున్నాయి. ప్రైవేటు స్కూళ్లకు గుర్తింపు మొదలు, రెన్యూవల్ వరకు ఇలా.. ఒక్కో స్కూలుకు ఒక్కో రేట్ ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 2,863 వరకు ఉన్నాయి. వీటిలో 1,319 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. అనధికారికంగా మరో వరకు ఉన్నట్లు అంచనా. వీటిలో సుమారు 6.84 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మెజార్టీ స్కూళ్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నిర్మాణ అనుమతులే కాదు..అగ్నిమాపక అనుమతులు కూడా లేవు. స్వయం ఉపాధి కోసం కొంతమంది ప్లే స్కూళ్లు నడుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూళ్లకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఆ తర్వాత వారిపై చర్యలు తీసుకోకపోగా, వారి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల హస్తినాపురం, బీఎన్‌రెడ్డి, బాలాపూర్, మాదాపూర్, శేరిలింగంపల్లి, అయ్యప్ప సొసైటీలోని గుర్తింపు లేని ఎనిమిది స్కూళ్లకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు వాటిలో ఏ ఒక్క యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కనీసం ఫైన్లు వేసిన ఆనవాళ్లు కూడా లేవు.

ఆ చట్టం అధికారులకు చుట్టం..

నిజానికి 'ఎస్టాబ్లిష్‌మెంట్, రికగ్నైజేషన్ అడ్మిషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ స్కూలు అండర్ ప్రైవేటు మేనేజ్‌మెంట్ స్కూల్స్ యాక్ట్ 1993 ప్రకారం నివాస భవనాల్లో తరగతులు నిర్వహించకూడదు. ఇలాంటి చోట తరగతుల నిర్వహణకు అనుమతి ఇవ్వకూడదు. కానీ జిల్లా విద్యాశాఖ ఇవేవీ పట్టించుకోకుండా అడ్డగోలుగా అనుమతులు జారీ చేస్తోంది. హస్తినాపురం సౌత్‌లోని ఓ ప్రైవేటు స్కూలుకు ఎలా అనుమతి ఇచ్చారనేదీ అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. బీఎన్‌రెడ్డి సమీపంలోని టీచర్స్ కాలనీలో నివాస భవనంలో ఓ ప్రైవేటు యాజమాన్యం డేకేర్ సెంటర్ పేరుతో ఒకటి నుంచి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వినాయకహిల్స్‌లో ఓ ప్రైవేట స్కూలు యాజమాన్యం ఏకంగా ఆట స్థలంలో నాలుగు అంతస్తుల భవనం నిర్మించి, ఫైర్ సేఫ్టీ వంటి కనీస చర్యలు చేపట్టకుండా తరగతులు నిర్వహిస్తున్నా స్పందన లేదు. ఏదైనా విద్యార్థి సంఘం లేదంటే తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే తాత్కాలికంగా షోకాజ్ నోటీస్ జారీ చేయడం, ఆ తర్వాత యాజమాన్యాలు ఇచ్చే తాయిలాలకు ఆశపడి.. అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పరిపాటిగా మారింది.

స్కూలు వద్ద కనీస పార్కింగ్ సదుపాయం కూడా లేకపోవడంతో పిల్లలు తమ సైకిళ్లను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. హస్తినాపురం చౌరస్తాలో తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యకు ఇది కూడా ఓ ప్రధాన కారణం.

తరగతులు ఓ చోట.. పరీక్ష మరోచోట

జిల్లాలో మెజార్టీ స్కూళ్లు ఇరుకైన భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సరూర్‌నగర్, బాలాపూర్, హయత్‌నగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాల్లో ఈ తరహా భవనాలు ఎక్కువగా ఉన్నాయి. నిర్మాణ అనుమతులు లేని ఈ భవనాల్లో తరగతుల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారనేదీ ఇప్పటికీ అంతు చిక్కడం లేదు. అనుమతుల్లేని వాణిజ్య భవనాల్లోనే కాదు ఏకంగా నివాస భవనాల్లోనూ తరగతుల నిర్వహణకు అనుమతులు ఇస్తుండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తనిఖీల సమయంలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిన అధికారులు వారు ఇచ్చే గిఫ్ట్‌లకు ఆశపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. కొన్ని యాజమాన్యాలు ఒకటి నుంచి ఏడు వరకు అనుమతి తీసుకుని.. పదో తరగతి వరకు పాఠ్యాంశాలు బోధిస్తున్నాయి. తీరా పరీక్షల సమయంలో మరో ప్రాంతంలోని మరో స్కూలు పేరుతో హాల్ టికెట్లు జారీ చేస్తున్నాయి. ఈ విషయం తెలిసీ జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మెజార్టీ ప్రైవేటు పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండడం లేదు. సగానికి పైగా ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ లేదంటే ఆశ్చర్య పోనవసరం లేదు. తాగునీరు కూడా విద్యార్థులే సమకూర్చుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. పరోక్షంగా పిల్లల అనారోగ్యానికి కారణమవుతున్నాయి. ఆట స్థలాలు కూడా లేకపోవడంతో శరీరానికి కనీస వ్యాయామం కూడా లేక చిన్న వయసులోనే పెద్ద జబ్బుల బారిన పడాల్సి వస్తోందని విద్యానిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

విద్యా వ్యవస్థకు పెద్దపీట వేయాలి

- జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యా వ్యవస్థకు కొత్త ప్రభుత్వం పెద్దపీట వేయాలని జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠ్ లో మంగళవారం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, డీఈఓ సుశీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులు ఉండాలన్నారు. విద్యార్థుల ఆలోచలనకు మెరుగుపెట్టి వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో తోడ్పడతాయన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. సమాజ వికాసానికి విద్యే మూలమన్నారు. రాష్ట్రంలోని 50 శాతం మంది విద్యార్థులకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలే దిక్సూచిగా ఉండటం సంతోషకరమన్నారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి ఆధునిక సాంకేతికత ఒక్కరోజులో పుట్టలేదని, ఎన్నో సంవత్సరాల నిరంతర ఆలోచన, తపన, నిర్విరామ కృషితోనే సాధ్యమైందన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యదశ నుంచే విశ్లేషణాత్మక ఆలోచనలను అలవర్చుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో గణిత, వైజ్ఞానిక, పర్యావరణానికి సంబంధించి 312 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వేదికపై నుంచి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పిన శ్రీనిధి అనే విద్యార్థిని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పిలిచి ప్రోత్సాహకంగా షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ సభ్యుడు భూపతిగాళ్ల మహిపాల్, మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, డీఈఓ సుశీందర్‌రావు, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు, డీసీఈబీ కార్యదర్శి రాంచంద్రారెడ్డి, మండల విద్యాధికారులు వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ నెల 13 నుంచి పతంగుల పండుగ

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ పతంగుల పండుగ వచ్చేసింది. వివిధ దేశాలకు చెందిన కైట్ ప్లేయర్స్ ఎగురవేసే రంగురంగుల, వైవిధ్యభరితమైన పతంగులు నగరవాసులకు కనువిందు చేయనున్నాయి. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఏటా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరుగనుంది. ఈ వేడుకలలో 1000 స్టాళ్లలో వివిధ రాష్ట్రాలకు చెందిన మిఠాయిలను ప్రదర్శించనున్నారు. వేడుకల్లో భాగంగా పలు సాంస్కృతిక, కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. 2016 నుంచి హైదరాబాద్ మహానగరం అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు ఆతిథ్యమిస్తోంది. పర్యాటక రంగాన్ని ఇతోధికంగా ప్రోత్సహించేందుకు నిర్వహించే ఈ వేడుకలకు అనూహ్యమైన స్పందన లభిస్తోంది. 2018లో సుమారు 8 లక్షల మంది వేడుకలను సందర్శించగా, ఆ తరువాత వరుసగా 2019లో 12 లక్షల మంది, 2020లో సుమారు 13 లక్షల మందికి పైగా నగరవాసులు వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కబ్జా చెర నుంచి కాపాడండి

ప్రజావాణిలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల వినతి

సాక్షి,రంగారెడ్డి జిల్లా: కబ్జాదారు చెరనుంచి తమ ప్లాట్లను కాపాడాలని బాధితులు అధికారులను వేడుకున్నారు. ఈ మేరకు రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు నగరంలోని ప్రజా భవనంలో జరిగిన ప్రజా వాణిలో మంగళవారం ఫిర్యాదు చేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి రామంతపురం రెవెన్యూ పరిధిలోని 47,48,49,77 సర్వే నంబర్లలో సుమారు 23 ఎకరాల్లో ప్లాట్లు చేశారు. 1986లో 290 మందికి పైగా ఆ ప్లాట్లను కొనుగోలు చేశారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా మాజీ జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్, ఆయన అన్న కుమారుడు వీరేశం, గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఉపేందర్‌రెడ్డి కలిసి తమ ప్లాట్లను కబ్జా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్లాట్లలో పైపుల దుకాణంతో పాటు ఓ బేకరీని ఏర్పాటు చేశారని.. తమను కబ్జాలోకి రానివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ రికార్డులు, పహానీల్లో సైతం తమ పేర్లు వస్తున్నాయని తెలిపారు. తమకు ఎక్కడిక వెళ్లినా న్యాయం జరగడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలి

- సంస్థ డిప్యూటీ ఆర్ఎం సుచరిత

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఉద్యోగులంతా కష్టపడి పని చేస్తున్నారని.. అదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆ సంస్థ డిప్యూటీ ఆర్ఎం సుచరిత అన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఉద్యోగులకు మంగళవారం వన భోజనాల కార్యక్రమాన్ని డిపో ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచనల మేరకు ఉద్యోగుల్లో చైతన్యం కల్పించి, వారిలో నూతనోత్సాహం నింపేందుకు వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం డీఎం వెంకట్‌నర్సప్ప, హయత్‌నగర్ 1,2 డిపో మేనేజర్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ వెంకటనర్సప్ప, మెకానికల్ ఇంజినీర్ సత్తయ్య, కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది హాజరయ్యారు.



ఆర్టీసీ మహిళా ఉద్యోగులతో ఆటపాటల్లో డిప్యూటీ ఆర్ఎం సుచరిత

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- సీఎంకు ఎస్‌జీటీయూ నేతల వినతి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

తలకొండపల్లి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేస్తూ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌జీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పండుగ అంజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఎస్‌జీటీయూ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. సంఖ్యతో, విద్యార్థుల నమోదుతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ప్రతీ పంచాయతీ పరిధిలో ఒక ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేసి, ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు, ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాలన్నారు. పాఠశాలల పరిశుభ్రతకు సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలన్నారు. సబ్జెక్టు కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. పది వేల పీఎస్ హెచ్ఎం పోస్టుల మంజూరుకు ఉత్తర్వులిచ్చి పదోన్నతులు, బదిలీలు చేపట్టి కొత్త నియమకాలు చేపట్టాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. పాఠశాల గ్రాంట్లు, మన ఊరు–మన బడి నిధులు విడుదల చేయాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యా య ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పండక్కి ముందే 'ప్రైవేట్' దోపిడీ!

సాధారణ బస్సు చార్జీలపై రెట్టింపు వసూళ్లు

- బుకింగ్‌లు లేవంటూనే అధిక చార్జీలు
- పిల్లలకు సంక్రాంతి సెలవులు కావడంతో టూర్లు
- ఆర్టీసీ నుంచి 4,484 సంక్రాంతి ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతికి సొంత ఊరు ప్రయాణాలు మొదలయ్యాయి. పిల్లలకు సెలవులు ప్రకటించడంతో నగరవాసులు సొంత ఊళ్లకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే అన్ని రెగ్యులర్ రైళ్లు, ప్రత్యేక రైళ్లు ఈ నెల చివరి వరకు పూర్తిగా బుక్ అయిపోవడంతో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పండుగ రద్దీ కంటే ముందే ప్రైవేట్ బస్సులు దోపిడీకి తెరతీశాయి. హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ రెగ్యులర్ సర్వీసుల్లో ఇప్పటికే ముందస్తు రిజర్వేషన్లు పూర్తయ్యాయి. దీంతో ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికులు రిజర్వే షన్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నగరం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రైవేట్ బస్సులకు సైతం డిమాండ్ నెలకొంది. ప్రయాణికుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ బస్సులు ఇప్పటికే సాధారణ చార్జీలను రెట్టింపు చేశాయి.

చార్జీల దోపిడీ ఇలా..

- హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే మ్యాక్సీ క్యాబ్‌లు, మినీ బస్సులు సైతం సంక్రాంతి దోపిడీకి తెరలేపాయి.
- హైదరాబాద్ నుంచి విజయవాడకు సాధారణ రోజుల్లో రూ.450 వరకు చార్జీ ఉంటే ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700కు పెంచారు.
- హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.1800 వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.



ప్రైవేట్ బస్సుల పర్మిషన్ల తనిఖీ

- హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖ, కాకినాడ, అమలాపురం, ఏలూరు తదితర రూట్లలో డిమాండ్ భారీగా ఉంది. హైదరాబాద్ నుంచి ఏపీ వైపు వెళ్లే అన్ని రైళ్లు భర్తీ అయ్యాయి. ఇటీవల ప్రకటించిన ప్రత్యేక రైళ్లలోనూ వెయిటింగ్ జాబితా 250 నుంచి 350 వరకు నమోదైంది.
- ప్రయాణికులు మరో గత్యంతరం లేక ప్రైవేట్ బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. రైళ్లు, ఆర్టీసీ బస్సుల తరహాలో ప్రైవేట్ బస్సుల్లోనూ ముందస్తు బుకింగ్‌లకు డిమాండ్ పెరిగింది.
- ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని చార్జీలను అడ్డగోలుగా పెంచారు. 'హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు నలుగురు కుటుంబ సభ్యులు కలిసి వెళ్లాలంటే రూ.10 వేలు దాటుతోంది. సంక్రాంతి చాలా పెద్ద పండుగ. ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరెళ్లాలని ఉంది. నలుగురం వెళ్లి, తిరిగి రావడమే భారంగా అనిపిస్తోంది' అని కూకట్‌పల్లికి చెందిన వేణుగోపాల్ తెలిపారు.

ఆర్టీసీ 4,484 సంక్రాంతి ప్రత్యేక బస్సులు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆర్టీసీ ఈ ఏడాది 4,484 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసింది.రెగ్యులర్ బస్సులకు ఇప్పటికే రిజర్వేషన్‌లు పూర్తికావడంతో ప్రయాణికులు ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్‌లు చేసుకుంటున్నారు. రెండు రోజులుగా ప్రత్యేక బస్సులకు కూడా డిమాండ్ పెరిగిందని, ప్రయాణికుల రద్దీకనుగుణంగా మరిన్ని అదనపు బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రస్తుతం 626 సర్వీస్‌లకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 15 వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. మరోవైపు ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సుల్లో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయాన్ని కల్పించనున్నారు. అలాగే సంక్రాంతి ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని, సాధారణ చార్జీలతోనే ప్రయాణికులు రాకపోకలు సాగించవచ్చని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు.

ఊరికి వెళ్లి..
వచ్చేసరికే ఊడ్చేశారు
తాళం వేసిన ఇంట్లో చోరీ

కేశంపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం మండల పరిధిలోని మంగలిగూడలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం బంధువుల ఊరికి వెళ్లాడు. మరుసటి రోజు ఇంటికి తిరిగి వచ్చే సరికి తాళం విరగ్గొట్టి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడేసి ఉండటాన్ని గమనించాడు. దుండగులు లోనికి చొరబడి బీరువాలో ఉన్న రెండు బంగారు ఉంగరాలు, గొలుసులు, పుస్తెల తాడు, వెండి చెంబులు, ప్లేట్లు, కలశం దోచుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ వరప్రసాద్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వీడని మిస్టరీ!

- మహిళ హత్య కేసులో నిందితుల కోసం గాలింపు చర్యలు
- పర్యవేక్షిస్తున్న చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

మొయినాబాద్: గుర్తు తెలియని మహిళను హత్య చేసిన ఉదంతం మిస్టరీగా మారింది. ఘటన జరిగి 24 గంటలు దాటినా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. మృతురాలి వివరాలు తెలియకపోగా హత్యచేసి మృతదేహాన్ని తగలబెట్టిన నిందితులు సైతం దొరకలేదు. వివరాలు తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పోలీసు బృందాలు నిర్విరామంగా పనిచేస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని మహిళ(25)ను నిందితులు ఎక్కడో హత్య చేసి మొయినాబాద్ మండల పరిధిలోని బాకారం శివారుల్లో రోడ్డు పక్కన తగలబెట్టిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై పోలీసులు స్పందించి నిందితుల కోసం మూడు బృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగారు. మంగళవారం ఘటన జరిగిన ప్రదేశానికి దగ్గరలో ఉన్న ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లు, వ్యవసాయ క్షేత్రాలను పోలీసులు పరిశీలించారు. వాటిల్లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా ఘటన జరిగిన తీరుపై ఆరాతీశారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం సేకరించిన నమూనాలను, సగం కాలిన సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచి నివేదికలు రావాల్సి ఉంది.

తెలియని మృతురాలి వివరాలు..

హత్యకు గురైన మహిళ వివరాలు ఇంకా తెలియలేదు. మృతురాలి వివరాల కోసం పోలీసులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. ఎక్కడైనా 25 ఏళ్ల మహిళలు, యువతులకు సంబంధించిన మిస్సింగ్ కేసులు నమోదయ్యాయా అనే వివరాలు తెలుసుకుంటున్నారు. చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈ కేసును ఛేదించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు తీవ్రం చేశారు. అదే విధంగా మృతురాలి వివరాలు తెలుసుకోవడంపైనా దృష్టి పెట్టారు.

బెదిరించి నగదు, నగలు చోరీ

- నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి వృద్ధురాలిని భయపెట్టిన ఆటో డ్రైవర్


బాధితురాలు లక్ష్మి

మంచాల: నమ్మి ఆటో ఎక్కిన ఓ వృద్ధురాలిని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి బెదిరించి నగదు, ఆభరణాలు చోరీకి పాల్పడిన సంఘటన మంచాల పోలీసుస్టేషన్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా లింగంపేట మండలం సంగారెడ్డిపేట గ్రామానికి చెందిన కొవ్వూరు లక్ష్మి(74) రెండు నెలల నుంచి మీర్‌పేట్‌లో చిన్న కూతురు వద్ద నివాసం ఉంటున్నారు. పెన్షన్ డబ్బులు అవసరం నిమిత్తం మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లారు. తిరిగి ఆదివారం సంగారెడ్డిలో బస్సు ఎక్కి హైదరాబాద్‌కు బయలు దేరారు. ఎంజీబీఎస్ బస్సు స్టాఫ్ దగ్గర ఆటోలో ఎక్కారు. ఆటో డ్రైవర్ రంగాపూర్–జాపాల మధ్య అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి నగదు కోసం బెదిరించాడు. రెండు తులాల బంగారు పుస్తెల తాడు, రూ.5 వేల నగదు, ఫోను లాక్కొని వృద్ధురాలికి వదిలేసి వెళ్లి పోయాడు. భయంతో మంచాల పోలీసులను ఆమె ఆశ్రయించారు. వెంటనే కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను సింగరేణి కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిసింది. విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు
గాయపడిన రైతు


ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో బోల్తాపడిన ట్రాక్టర్

మొయినాబాద్: ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను వెనకనుంచి ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తాపడి ఓ రైతు గాయపడ్డాడు. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... మండల పరిధిలోని తోలుకట్ట గ్రామానికి చెందిన రైతు కుమ్మరి సత్తయ్య వడ్ల బస్తాలను ట్రాక్టర్ ట్రాలీలో వేసుకుని సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మొయినాబాద్‌లోని రైస్‌మిల్‌కు వెళ్తున్నాడు. మండల కేంద్రం సమీపంలోని తాజ్ హోటల్ వద్దకు రాగానే పరిగి నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంతో వచ్చి వెనక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ చాకలి శ్రీశైలం, రైతు కుమ్మరి సత్తయ్య ట్రాక్టర్ పైనుంచి ఎగిరి పడ్డారు. రైతు సత్తయ్యకు గాయాలయ్యాయి. వడ్ల బస్తాలు కింద పడిపోయాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు, పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్ సమయానికి రాకపోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌లో గాయాలైన రైతును ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

- ప్రతి సమావేశానికి అధికారులు హాజరు కావాల్సిందే
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాజకీయాలను పక్కనపెట్టి అందరూ అభివృద్ధి బాట పట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి పథకాలతో మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల సమయం ముగిసినందున అందరూ రాజకీయాలను పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమన్నారు.

అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి

మండల పరిషత్ పరిధిలో నిర్వహించే సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరవ్వాల్సిందేనని ఎమ్మెల్యే రంగారెడ్డి ఆదేశాలు జారీచేశారు. ఇప్పటి వరకు జరిగిన సమావేశాలకు అధికారులు హాజరు కాకపోయినా ఏమీ కాలేదు అనే నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. ఏ సమావేశం నిర్వహించినా ప్రతి శాఖకు సంబంధించిన అధికారి మండలానికి సంబంధించిన వివరాలతో హాజరు కావాలన్నారు.

మండల పరిషత్ కార్యాలయ ఏర్పాటుకు..

మండలాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో అధునాతనమైన మండల పరిషత్ కార్యాలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రంగారెడ్డి హామీ ఇచ్చారు. గతంలో హయత్‌నగర్‌లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిర్మించిన మండల పరిషత్ భవనం ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేఖామహేందర్‌గౌడ్, జడ్పీటీసీ దాసుగౌడ్, వైస్‌ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఎంపీడీఓ మీరాబాయి, వైస్‌చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, సర్పంచులు వెంకటేశ్, మహేశ్‌గౌడ్, లతాశ్రీ,సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, రంగయ్య ఎంపీటీసీలు వెంకటేశ్, గ్యార బాలలింగస్వామి, బాలమణి, మహ్మద్‌గౌస్‌పాషా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గృహహింస కేసులో ఏడాది జైలు
రూ.ఐదువేల జరిమానా


ధర్మేందర్ యాదవ్

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పీఎస్లో మూడేళ్ల క్రితం నమోదైన గృహహింసం కేసులో ఓ వ్యక్తికి ఎల్‌బీ నగర్ న్యాయస్థానం ఏడాదిజైలు శిక్షతో పాటుగా రూ.ఐదు వేల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన ప్రకారం 2021లో శంషాబాద్ మండలం రాళ్లగూడ గ్రామానికి చెందిన బి.ధర్మేందర్ యాదవ్‌పై వరకట్నం, గృహహింస కేసు నమోదైంది. పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి ధర్మేందర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటుగా రూ.5వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు

- సైంటిస్టు డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్
- కోరింతకుంట తండాలో రైతులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సైంటిస్టు వినోద్‌కుమార్ యాదవ్

తలకొండపల్లి: వ్యవసాయానికి అనుబంధంగా పట్టు పురుగుల పెంపకం చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని సైంటిస్టు డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్ సూచించారు. నిత్యం పని చేసే చిన్న సన్నకారు రైతులకు పట్టు పురుగుల పెంపకం ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడితో ఏడాది అంతా పంటను తీసుకోవచ్చన్నారు. ప్రతి నెలా ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నారు. మండల పరిధిలోని కోరింతకుంట తండాలో, సెంట్రల్ సిల్క్‌బోర్డు, రీజినల్ సెరికల్చర్ రిసర్చ్ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతు దినోత్సవ సందర్భంగా పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల సాగుపై పట్టు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వినోద్‌తో పాటు, అసిస్టెంట్ సైంటిస్టు డాక్టర్ రాఘవేందర్, సీనియర్ టెక్నికల్ అధికారి తుయమనిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పట్టు పురుగులకు నాణ్యమైన మల్బరీ ఆకులను మేతగా వేస్తే దిగుబడి అధికంగా వస్తుందన్నారు. పట్టు సాగులో రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మల్బరీ తోటలను సాగు చేసే రైతాంగానికి అనేక రాయితీలు, ప్రోత్సాహకాలను అందజేస్తుందన్నారు. మల్బరీ పెంపకం నుంచి షెడ్డు నిర్మాణం వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశ పెట్టినట్లు గుర్తు చేశారు. అనంతరం పట్టు పురుగుల పెంపకం, మెళకువలు, మల్బరీ తోటల సాగు విధానంపై చర్చించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఎస్‌ఓ నీరజగాంధీ, హార్టికల్చర్, సెరికల్చర్‌ల అసిస్టెంట్ డైరెక్టర్లు సంజయ్ కుమార్, ముత్యాలు, పట్టు రైతుల జిల్లా నాయకులు సయ్యద్ రఫీక్, సయ్యద్ సాదిక్, శుక్రునాయక్, భూషన్, ప్రశాంత్‌రెడ్డి, మల్లేశ్, రవీందర్, దేవిలాల్, స్వాతిరెడ్డి, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ తండాకు చెందిన సీతారాం(47) 2023 నవంబర్ 11న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. నాటి నుంచి పంజగుట్టలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

బైక్ చోరీ.. కేసు నమోదు

తలకొండపల్లి: ఎనిమిది నెలల క్రితం బైక్ చోరీకి గురైన విషయంలో మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తాళ్లగుట్టతండాకు చెందిన గోపాల్ పెద్దూరు తండాలో ఎనిమిది నెలల క్రితం మేస్త్రీ పని చేస్తున్నాడు. వారు పని చేసే ప్రదేశంలో బైక్ గుర్తు తెలియని వ్యక్తులు బైక్ ఎత్తుకెళ్లారు. బైక్ ఈఎంఐ కట్టకపోవడంతో ఇటీవల ఫైనాన్స్ కంపెనీవారు నోటీసులు ఇచ్చారు. దీంతో గోపాల్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సిలిండర్ల పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

పహాడీషరీఫ్: బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్న ఇద్దరిపై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లి గ్రామంలో యాదగిరి, నర్సింగ్‌లు కిరాణ దుకాణాలలో గృహావసర, వాణిజ్య సిలిండర్లను ప్రజల నుంచి కొనుగోలు చేసి నిల్వ ఉంచారు. ఈ సిలిండర్లను అవసరమైన వారికి అధిక మొత్తానికి విక్రయిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడి చేసి 58 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం

- వ్యవసాయ క్షేత్రంలోని పాడుబడ్డ గదిలో లభ్యం
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: అనుమానాస్పద స్థితిలో వ్యవసాయ క్షేత్రం వద్ద పాడుబడిన గదిలో కుళ్లిపోయి దుర్వాసన వస్తున్న ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మంగళ్‌పల్లికి చెందిన జి.శ్రీశైలం వ్యవసాయ భూమి వద్ద ఉన్న రేకుల షెడ్డు ఉంది. అక్కడ గుర్తు తెలియని ఓ మహిళ(55) మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సుమారు 10–12 రోజుల క్రితమే చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి శరీరంపై కుడి చేయిపై మూడు స్టార్ గుర్తులు నల్లని, ఎరుపు రంగులో ఉందన్నారు. మెడలో నల్లపూసలు, ఎర్రపూసలు, ఓం గుర్తు లాకెట్‌తో కలిగిన పుస్తెల తాడు, కుడి కాలుకు నల్లని దిష్టి దారం, ఎడమ చేతిపై హిందీలో ట్యాటు ఉన్నట్లు తెలిపారు. కౌలు రైతు కాలే రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని వ్యక్తి మృతి


జితేంద్రకుమార్‌వర్మ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జితేంద్ర కుమార్‌వర్మ(46), ధర్మేందర్‌తివారి గత కొంత కాలంగా ఎలికట్టలో అద్దె గదిలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇద్దరూ చికెన్ వండుకొని పూరీలు చేసుకొని మద్యం తాగుతూ భోజనం చేస్తుండగా జితేంద్రకుమార్ ఒక్కసారిగా కింద పడిపోయాడు. పక్కన వారు వచ్చి చూసే సరికి అతడు చనిపోయాడు. విషయాన్ని తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని చనిపోయినట్లుగా నిర్ధారించారు. ధర్మేందర్ తివారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు బాగు

- రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- అవగాహన సదస్సులో ఉద్యాన అధికారి ఉషారాణి


సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉషారాణి

కొందుర్గు: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని షాద్‌నగర్ ఉద్యాన అధికారిణి ఉషారాణి సూచించారు. మంగళవారం కొందుర్గు రైతువేదికలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని, రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఐదు ఎకరాల లోపు ఓసీ, బీసీ రైతులకు 90 శాతం, 5 ఎకరాల పైన ఉన్న రైతులకు 80 శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం అందిస్తామన్నారు. ఆయిల్ పామ్ పంట మూడేళ్ల అనంతరం చేతికొస్తుందని, అంతవరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చని వివరించారు. పంట దిగుబడి వచ్చే వరకు వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ద్వారా నియమించబడిన ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పంట చేతికొచ్చిన అనంతరం మార్కెటింగ్ సదుపాయం ఉంటుందని అన్నారు. ఈ ఏడాది రంగారెడ్డి జిల్లాలో 5,500 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుందని ఇందులో భాగంగా షాద్‌నగర్ డివిజన్‌లో 1,500 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేయడానికి నిర్దేశించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీశైలం, వాసవి, లక్ష్మీకాంత్, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

శంషాబాద్ రూరల్: గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని పలువురు సర్పంచులు మండల సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీపీ జయమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు సమస్యలను విన్నవించారు. చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలకు బస్సు సర్వీసులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణం సమయంలో ఆధార్‌కార్డు జిరాక్స్ లేదా ఫోన్‌లో చూపించినా అనుమతించాలని కోరారు. సర్పంచుల పదవి త్వరలో ముగియనుండగా.. కొత్త సర్పంచులు వచ్చే వరకు గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తన్వీ, వైఎస్ ఎంపీపీ నీలం, సొసైటీ చైర్మన్లు సతీష్, దొనాకర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు ఇందిరా, గౌతమి, యాదగిరి, కో–ఆప్షన్ సభ్యుడు గౌస్, సర్పంచులు రాంగోపాల్, బుచ్చమ్మ, హస్లీ, కల్పన సింహారెడ్డి, సతీష్, రమేష్, దేవా, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు

శంషాబాద్: ప్రజలకు ఇబ్బందులు కలగకుంగా త్వరలో సిద్ధాంతి, సాతంరాయిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జీల ఏర్పాటు జరగనుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సిద్ధాంతి, సాతంరాయిలో హైవే దాటేందుకు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనికి కోసం గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఈ రెండింటితో పాటు గగన్‌పహాడ్ వద్ద అండర్ బ్రిడ్జీని కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.